# రాజకీయ చత్వారం

ప్రాచీన దిబ్బ పత్రాలు తిరగేస్తుంటే ఈ వింత విషయం నాకు తెలియవచ్చింది.

దిబ్బ ఒకప్పుడు లోహపరిశ్రమకూ, లోహకారులకూ ప్రసిద్ధి. దిబ్బ సైనికుల శౌర్యపరాక్రమాల మాట మనకు తెలీదుగాని దిబ్బ ఆయుధాలంటే చుట్టుపక్కల రాజ్యాలకు హడలుగా ఉండేది.

అయితే దిబ్బలో చందనం లేదు. దాన్ని దిబ్బకు తిరుగుండం అమ్మేది. దిబ్బకూ, తిరుగుండానికి అనాదిగా వైరు ఉన్నప్పటికీ, ఉభయ దేశాలూ వర్తక సంబంధాలు కలిగి ఉండేవి.

ఇలా ఉండగా తిరుగుండం రాజు ఒకసారి అకస్మాత్తుగా దిబ్బకు చందనం ఎగుమతి నిషేధించాడు. దిబ్బలో పదిహేను కుటుంబాలకు చందనం లేకుండా జరగదు. అందుచేత చందనంకోసం రాయబారాలూ, సంప్రదింపులూ, సమావేశాలూ జరిగాయి.

"మాకు మీరు ఖడ్గాలూ, ఈటెలూ, బరిసెలూ, బాణపు ములుకులూ మొదలైనవి భారీ ఎత్తున మారకం వేసేటట్టయితే చందనం ఇస్తాం" అన్నాడు తిరుగుండం రాజు.

అందుకు దిబ్బరాజూ, దిబ్బమంత్రులూ ఒప్పుకున్నారు. లోహకారులు అహో రాత్రాలు పనిచేసి తిరుగుండానికి కావలసిన ఆయుధ సామాగ్రి అందించారు. దిబ్బ సైన్యానికి కావలసిన ఆయుధాలు తయారు చేసే వ్యవధి కూడా వారికి లేకపోయింది.

ఆ సంవత్సరమే మొట్టమొదటిసారిగా దిబ్బరాజ్యం తిరుగుండం చేతిలో ఓడిపోయి, చావుదెబ్బ తిన్నది. అది తిరిగి కోలుకోవటానికి ఇరవై ఏళ్లు పట్టిందిట.

***ముద్రణ : యువ, మార్చ్ 1977***